# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-07-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ యువత శక్తి సామర్థ్యాలతోనే అభివృద్ధి చెందిన భారతదేశం సాధ్యమవుతుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు.
- ❖ “తల్లికి వందనం” పథకం నిధులను త్వరలోనే విడుదల చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 2029 అసెంబ్లీ ఎన్నికల్లో ‘మావిగన్’ ప్రధాన అజెండాగా ఎన్నికలకు వెళ్తుందని ఆ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు.
- ❖ ప్రకృతి వారసత్వాన్ని కాపాడటం ప్రతీ ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు.
- ❖ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీ ఈఏపీసెట్-2026 ఫలితాలు విడుదలయ్యాయి.

========================

యువత శక్తి సామర్థ్యాలతోనే అభివృద్ధి చెందిన భారతదేశం సాధ్యమవుతుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో ప్రతి విద్యార్థి భాగం కావాలని పిలుపునిచ్చారు. అనంతపురంలో ఈరోజు జరిగిన ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వ విద్యాలయం తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొని 1,268 పట్టభద్రులకు డిగ్రీలు, 56 మందికి గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ... విశ్వవిద్యాలయంలో కష్టపడినట్లే భవిష్యత్‌లోనూ ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. జీవితంలో ఏ స్థాయికి చేరుకున్నా విద్యా సంస్థతో అనుబంధాన్ని కొనసాగించాలన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచంలోకి పట్టభద్రులుగా అడుగుపెడుతున్నారని పేర్కొంటూ, సాంకేతిక పురోగతి ప్రతి రంగాన్ని వేగంగా మారుస్తోందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో కేవలం డిగ్రీ పొందడం ద్వారా జ్ఞాన సముపార్జన ముగియకూడదని, నేర్చుకునే ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని స్పష్టం చేశారు. వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేయడానికి, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని రాష్ట్రపతి సూచిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

========================

రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ప్రజాభీష్టం మేరకు ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం పున్నపువారిపాలెంలో ముఖ్యమంత్రి ఈరోజు "పేదల సేవలో" కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజా వేదిక సభలో ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ... ప్రజల జీవితాల్లో శాశ్వతంగా వెలుగు నింపాలనే లక్ష్యంతోనే పని చేస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతగానే ప్రతీ నెలా 1వ తేదీన కనీస అవసరాలు తీర్చుకోలేని ఆపన్నులకు పెన్షన్ అందిస్తున్నామని చెప్పారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు సహా 28 కేటగిరీల లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తూ.. వారిని ఆదుకుంటున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ 68 వేల 598 కోట్ల రూపాయల మేర పెన్షన్ల కింద ప్రభుత్వం పంపిణీ చేసిందని, ప్రతీ నెలా 62 లక్షల 20 వేల మందికి 2 వేల 712 కోట్ల రూపాయలు పెన్షన్లకు చెల్లిస్తున్నామని వెల్లడించారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, దివ్యాంగ శక్తి, మత్స్యకారుల సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో లాంటి వివిధ పథకాలను అమలు చేస్తున్నామని, త్వరలోనే తల్లికి వందనం పథకం నిధులను కూడా విడుదల చేస్తామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ..

(వాయిస్ 29 సెకన్లు)

========================

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం రాష్ట్ర పరిధిలో నిర్వహించే ఏపీ ఈఏపీసెట్-2026 ఫలితాలు ఈ మధ్యాహ్నం విడుదలయ్యాయి. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఫలితాలను సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా విడుదల చేసి ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంజినీరింగ్‌లో లక్షా 82 వేల 317 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అందులో 69.63 శాతం మంది బాలురు, 71.65 శాతం మంది బాలికలు ఉన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 89.59 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీలో 90.22 శాతం మంది బాలురు 89.40 శాతం మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు.

విరామం

========================

రానున్న 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 'మావిగన్' అజెండాతోనే ప్రజల ముందుకు వెళ్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికలు 'మావిగన్ వర్సెస్ అమరావతి'గా మారనున్నాయని పేర్కొంటూ.. ప్రజలు ఏ విధానానికి మద్దతు ఇస్తారో ఎన్నికల్లో తెలుస్తుందన్నారు. ప్రజా తీర్పుకే తాము ఎప్పుడూ కట్టుబడి ఉంటామని తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ... రాజధాని అమరావతి నిర్మాణంలో అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా అభివృద్ధి చేయాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. అదే విధంగా డీఎస్సీ అంశంలో తమ పార్టీ ఆధారాలతో మాట్లాడిందని, తాము చేసిన ఆరోపణలు తప్పని ప్రభుత్వం భావిస్తే.. వాటిని ఆధారాలతో ఖండించాలన్నారు. వాస్తవాలను ఆధారాలతో చెప్పినప్పుడే ప్రజలు వాటిని నమ్ముతారని, నిరాధార ఆరోపణలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

========================

రాష్ట్ర వ్యాప్తంగా 12 నగరవనాలు, 6 ఎకో టూరిజం పార్కులను ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ వర్చువల్ విధానంలో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగరాల్లో పచ్చదనం పెంచడానికి నగరవనాలు ఉపయోగపడుతున్నాయని, కాలుష్యంతో నిండిపోయిన నగరాలకు ఈ వనాలు ఊపిరినిస్తున్నాయని చెప్పారు. 36 కోట్ల

రూపాయలతో నగరవనాలు, ఎకో పార్కులు ఏర్పాటు చేశామన్నారు. నక్షత్రవనాలు, రాశి వనాల ద్వారా సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. నగరవనాలు రాబోయే తరాల కోసం నిర్మిస్తున్న పచ్చని వారసత్వమని, ప్రకృతి వారసత్వాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యతగా భావించాలని పవన్ కళ్యాణ్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

========================

నరసాపురం నుంచి ప్రత్యేక రైలుగా నడుస్తున్న నర్సాపురం–అరుణాచలం (తిరువణ్ణామలై) ఎక్స్‌ప్రెస్ పూర్తిస్థాయి రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌గా మారింది. ఆ రైలు తొలి రెగ్యులర్ సర్వీస్‌ను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ భీమవరం టౌన్ రైల్వే స్టేషన్‌లో లాంఛనంగా ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గత ఏడాది జూలై 9న ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తి మేరకు తిరువణ్ణామలై స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించామని, దానికి ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించడంతో రెగ్యులర్ సర్వీస్‌గా మార్చాడానికి అధికారుల నుండి ఆమోదం లభించిందన్నారు. రెగ్యులర్ సర్వీస్‌గా మారడంతో ఇకపై అదనపు ఛార్జీలు, రైలు ఆలస్యం, ఆకస్మిక రద్దు వంటి సమస్యలు ఉండవన్నారు.

========================

వైద్య వృత్తి కేవలం ఉపాధి కోసం కాకుండా మానవ సేవకు అంకితమైన అత్యున్నత వృత్తి అని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ తెలిపారు. భారతదేశపు ప్రముఖ వైద్యుడు, పరిశోధకుడు డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జయంతిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సురేష్ కుమార్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.సి. రాయ్ కాంస్య విగ్రహం ఆవిష్కరణతో పాటు వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన 10 మంది ప్రముఖ వైద్యులను ఘనంగా సత్కరించి పురస్కారాలు అందించారు.

========================
========================